క్లుప్తంగా

మార్చి 3న మండల సర్వసభ్య సమావేశం

పెనగలూరు : మార్చి 3న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలియజేశారు. మండలాధ్యక్షురాలు వసుంధర అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల నివేదికలపై చర్చ ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డా.మైనుద్దీన్

రాయచోటి టౌన్ : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ మైనుద్దీన్ రక్తదాతలను కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రవి హాల్‌లో జరిగిన శిబిరంలో 23 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న మైనుద్దీన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత యువకులపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఫిరోజ్ ఆసిఫ్, మహమ్మద్, నవాజ్, అఫ్జల్ పాల్గొన్నారు.

24 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : మండలంలోని చెన్నముక్కపల్లె గ్రామ పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 24మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 60 మంది కంటి రోగులు హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించి 24మందికి ఆపరేషన్‌లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 45మంది కంటి రోగులకు తిరిగి కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు, కంటిఅద్దాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ స్వరూప్‌గుప్తా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, లయన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు



పట్టుబడిన కోళ్లు, నిందితులతో సిబ్బంది

వీరబల్లి : మండలంలోని సానిపాయి గ్రామం అంచలవాండ్లపల్లి సమీపంలో కోడిపందెం ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ రహిముల్లా తన సిబ్బందితో కలిసి ముగ్గురు వ్యక్తులను, నాలుగు కోళ్లు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 2600లు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

సంబేపల్లె : మండలంలోని గుట్టపల్లె పంచాయతీ వడ్డెపల్లెకు చెందిన హేమచంద్రిక అనే విద్యార్థికి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిలు ఆదివారం ఆర్థికసాయం చేశారు. హేమచంద్రిక కలకడ మండలంలోని కస్తూర్బా పాఠశాలలో 9వతరగతి చదువుతోందన్నారు. చెన్నై, ఢిల్లీ ప్రాంతాలలో ఇటీవల జరిగిన కరాటీ, త్రోబాల్, కబడ్డీ క్రీడలలో ప్రతిభ కనబరిచిందని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు తెలిపిందన్నారు.

600 కిలోల ప్రభుత్వ రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడి వీధి నుంచి బెల్లంమండి వీధికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యంను ఆదివారం ఎస్‌ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దండుకు చెందిన వెంకట సుబ్బమ్మ, తన దోసెల అంగడి కోసం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఆటోను, 15 బస్తాలు (ఒక్కో బస్తాలో 40 కిలోలు) మొత్తం 600 కిలోలను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక ఎస్‌ఎస్‌ఎల్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గంగమ్మ ఆలయంలో భక్తుల తాకిడి

- వేలాదిగా పాల్గొన్న భక్తులు
- అమ్మవారికి మొక్కులు, బోనాలు
- దర్శనానికి క్యూలైన్‌లు ఏర్పాటు చేసిన ఆలయ చైర్మన్, ఈఓలు



గాలివీడు: కల్లిపాటు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ



లక్కిరెడ్డిపల్లి: దర్శనం కోసం క్యూలైన్లో భక్తులు



లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ



సిద్దవటం: ప్రత్యేక పూజలందుకున్న ఇరుగులమ్మ



చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ

లక్కిరెడ్డిపల్లి : భక్తుల తాకిడితో ఆదివారం మరోమారు గంగమ్మ ఆలయం జాతరను తలపించింది. జాతర ముగిసిన మొదటి ఆదివారం కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల వారితోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులకు లక్కిరెడ్డిపల్లె ఎస్‌ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో శీతలపానీయాల దుకాణాలు, మిఠాయి దుకాణాలు, బొమ్మల కొలువులు, చెరుకుల బండ్లు అధిక సంఖ్యలో రావడంతో వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ఆలయ పూజారులైన ఆదిమూలం చంద్రశేఖర్, వేమయ్య, గంగయ్య, రెడ్డిశేఖర్, బోస్‌లు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక పూసలపేట, శెట్టివారిపల్లెలో వెలసిన పోలేరమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. శనివారం ఉదయం సిద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమైన జాతర రాత్రి నిండు తిరునాలలో చెక్కభజనలు, కోలాటాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొక్కుబడులు కలిగిన భక్తులు అమ్మవారికి ఛాందినీ బండ్లను కట్టి అమ్మవారి ఆలయం చుట్టూ బండ్లను తిప్పారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సాయంత్రం కల్లిపాటు కార్యక్రమంతో జాతర ముగిసింది.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులోని ఇరుగులమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆకు పూజ, కుంకుమార్చన, సహస్రనామార్చన, వంటి పూజా కార్యక్రమాలు చేశారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించగా, మరికొందరు భక్తులు అమ్మవారికి కాయాకార్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి గుడికి వచ్చిన భక్తులకు మూలపల్లె గ్రామానికి చెందిన అల్లూరు మస్తాన్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నల్ల గంగమ్మ ఆలయంలో విశేష పూజలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు.అర్చకులు అమ్మవారికి ఏకాంతంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మల్లూరమ్మకు..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది వద్ద కొలువైన మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

శాంతి రథం ఏర్పాటు చేస్తాం



డాక్టర్, అన్నదాతను సన్మానిస్తున్న మానవత సేవా సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : దాతల సహకారంతో త్వరలో మరో శాంతి రథం ఏర్పాటు చేస్తామని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన నెలవారీ మానవత సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డాక్టర్ రెడ్డిచైతన్య నల్లపల్లి, సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన అన్నదాత పతమేకల సోమశేఖర్‌లను సన్మానించి నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వెంకటరమణ, సెంట్రల్ కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, జిల్లా సభ్యులు ఆనందరెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, జయచంద్రారెడ్డి, రెడ్డప్పరెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం; కేసు నమోదు

ఓబులవారిపల్లె : మండలంలోని నూకనపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి వద్ద 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పక్కా సమాచారంతో నూకనపల్లి గ్రామంలో తమ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించగా మద్యం పట్టుబడినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రెండు బ్యాచ్‌లుగా విభజించి నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక బ్యాచ్‌కు మధ్యాహ్నం మరో బ్యాచ్‌కు పరీక్షలు నిర్వహించారు. అనేక మంది విద్యార్థులు పరీక్ష ప్రారంభ సమయానికి 30 ని. ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఎంపీసీ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో 14 మందికి 14 మంది హాజరయ్యారు. అలాగే బైపీసీ విభాగంలో 65 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా ఒకరు గైర్హాజయ్యారు. కాకతీయ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఎంపీసీ విభాగంలో 80 మంది పరీక్షకు హాజరు కావాల్సివుండగా ఇద్దరు గైర్హాజరు కాగా, బైపీసీ విభాగంలో 36 మందికి ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. నలంద జూనియర్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో 66 మంది పరీక్షలకు హాజరు కావాల్సివుండగా అందరు హాజరయ్యారు. బైపీసీ విభాగంలో 64 మంది పరీక్షకు హాజరు కావాల్సివుండగా ఒకరు గైర్హాజరయ్యారు. గీతాంజలి జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగం విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరగగా, 15 మంది విద్యార్థులకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 111 మందికి 109, 79 మందికి 77 మంది హాజరయ్యారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

రాయచోటి అర్బన్ : ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అన్నారు. అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం హరిప్రసాద్ అధ్యక్షతన రాయచోటి శివ నర్సింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 9 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పదుల సంఖ్యలో యాప్‌ల నిర్వహణ ద్వారా బోధనేతర కార్యక్రమాలు చేపడుతూనే తిరిగి విద్యార్థులకు బోధన చేయవలసి వస్తోందంటూ చెప్పారు. పని సర్దుబాటు పేరుతో రకరకాల ఉత్తర్వులివ్వడం వలన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ విమర్శించారు. ఉన్న యాప్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తుంటే ఆపనిచేయకపోగా బైజూస్ పేరుతో ఏరోజుకారోజు ట్యాబ్‌ల సమాచారం అప్‌లోడ్ చేయాల్సి వస్తుండడం ఉపాధ్యాయులకు అదనపు భారమేనన్నారు. బోధనేతర కార్యక్రమమైన ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరం పెట్టామని చెబుతున్న ప్రభుత్వం అన్ని రకాల యాప్‌ల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సహాధ్యక్షులు శివా రెడ్డి, కె.హేమలత, కోశాధికారి అక్రమ్‌బాషా, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, గోపాల్ నాయక్, వెంకట సుబ్బయ్య, గంగాదేవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్రిష్టారెడ్డి, చెంగల్‌రాజుతోపాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాజంపేట మండల కమిటీ ఎన్నిక

రాజంపేట టౌన్ : స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యూనియన్ మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.పాపయ్య, అధ్యక్షుడిగా ఎం.రమణయ్య, ఉపాధ్యక్షులుగా పి.రవిచంద్రప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.సుమలత, ప్రధాన కార్యదర్శిగా జి.నాగేంద్ర, కోశాధికారిగా కె.శివయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.నాగేశ్వర్‌గౌడ్, పి.వెంకటసుబ్బయ్య, డి.చెంగల్‌రాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కలకడ : మండలంలో 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ నాగేంద్ర తెలిపారు. ఆదివారం మండలంలోని ఎనుగొండపాళ్యెం, ఎగువ తండ, దిగువతండ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నాటుసారా తయారీకి వినియోగించే డ్రమ్ములు, పొయ్యిలు, సారా ఊటను ధ్వంసం చేశారు. అనంతరం సీఐ గ్రామాలలో పర్యటించి సారా వలన కలిగే అనర్థాలను వివరించారు. దాడులలో కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మహిళపై దాడిచేసిన ఇద్దరిపై కేసు

కలకడ : మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం సంజీవరాయునిపల్లెకు చెందిన సంజీవరెడ్డి భార్య మాధవిపై కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరంగారెడ్డి, అతని భార్య విజయలక్ష్మి దాడి చేశారు. మధవి నుంచి అప్పు తీసుకొన్న వారిని డబ్బు అడిగినందుకు దాడి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సంతానం కోసం మహిళలు ఆలయ పరిసరాల్లో ఆకుపసరు సేవించి అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతాన ప్రాప్తి కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

గర్నిమిట్ట యల్లమ్మకు విశేష పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ తల్లికి విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గర్నిమిట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



సమస్యలపై మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లి : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి ప్రజల పక్షాన నిలబడతానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దప్పేపల్లె, పాలెంగొల్లపల్లి పంచాయతీల పరిధిలో నిర్వహించిన దేవర కార్యక్రమానికి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానికులు, మహిళలతో గ్రామాల్లోని సమస్యలపై ఆరాతీశారు. ఎక్కడికక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా నూతన బోర్లను వేయిస్తున్నామని, ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కాలేటివాగు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని ప్రతి చెరువుకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందించడానికి పనులు జరుగుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, ఎంపీటీసీలు శంకర్ నాయుడు, లక్ష్మీనారాయణ, సర్పంచ్ వెంటరమణ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, వాటర్‌షెడ్ చైర్మన్ నాగముని, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, ధర్మారెడ్డి, అంబాబత్తిన రమేష్, లల్లూ యాదవ్, కదిరప్ప, ఓబులేశు, ఆంజనేయుల నాయుడు, హరినాథ, మోహన్ రెడ్డి, శివమల్లప్ప నాయుడు, అలీబాషా, మల్లేష్ నాయుడు, మధు, గల్లా శివశంకర్, వేముల జయచంద్ర, వేముల ఏయాటీ, బండమీద ఆంజనేయులు, తమ్మిశెట్టి బాబు, మాచినేని చంద్రశేఖర్ నాయుడు, కుమార్, వెంకటేశ్వర్లు, బాబురెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీలుగా ఉద్యమ అభ్యర్థులనే గెలిపించుకుందాం'



మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేపథ్యం ఉన్న అభ్యర్థులనే గెలిపించుకుందామని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాలలో పాల్గొనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహా రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులను గెలిపించుకోవడం ద్వారా ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు చట్టసభలలో తమ వాణిని వినిపించుకునే అవకాశం ఉంటుందన్నారు. 28న స్థానిక ఎన్జీఓ సభా భవనంలో జరిగే సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొంటారన్నారు. సమావేశంలో సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, మండెం సుధీర్, సుమిత్రమ్మ, కోటేశ్వర రావు, వంగిమళ్ళ రంగారెడ్డి, జక్కల వెంకటేష్, వెంకటేశు, పుల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష మద్దతుదారులను గెలిపించండి

వామపక్ష పార్టీల మద్దతుతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సమావేశంలో రైతుసంఘం నేతలు నాగబసిరెడ్డి, ఎస్.రామచంద్ర, ఎస్.ఓబులమ్మ, ఖాజాబి, ఫయాజ్, డి.సి.వెంకటయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

రైల్వేకోడూరు : చిన్ననాటి జ్ఞాపకాలు చెరిగిపోనివి. బాల్యంలో మనం గడిపిన క్షణాలు అత్యంత మధురమైనవి. పట్టణంలోని హెచ్‌ఎమ్‌ఎమ్ హైస్కూల్ 1984 పది బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం రాజు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్ల తరువాత అందరూ కలుస్తుండటంతో అందరూ హాజరై యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కాసేపు ఆహ్లాదంగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు తోట సుబ్రమణ్యం సాయి, చెరువు వెంకటరమణ, అంబటి కిరణ్, మస్తాన్, రామిరెడ్డి పద్మావతి, చంద్రకళ, కళావతి, సురేష్‌రెడ్డి, సత్యనారాయణ, రమణయ్య, కాలవ రవీంద్ర, షఫీ, రామక్రిష్ణ, మధు, భాస్కర్‌రాజు, హరినాద్‌రెడ్డి, శ్రీధర్, చిన్నా, శివకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సమష్టిగా కృషి చేయండి

ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై కౌన్సిలర్లు, నేతలతో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ భేటి



రాజంపేట రూరల్: కోఆర్డినేటర్లకు దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాజంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా, పక్కనే జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ తదితరులు

రాజంపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మేడాభవన్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి రాజంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిల గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను అందజేస్తున్నామన్నారు. అందరూ ప్రతి ఓటరును ఫాలప్ చేసుకొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. ఏ ఒక్క ఓటు కూడా మిస్ కారాదన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎన్నికల విషయంలో ప్రతి అంశాన్ని కూడా సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాను కౌన్సిలర్‌లు, నాయకులవారీగా అందజేస్తామన్నారు. తమ తమ పరిధిలో రోజుకు రెండు నుంచి మూడు గంటలపాటు ఓటర్లకు సంబంధించిన సమాచారం, వారి మద్దతును కూడగట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అందరం ఒకతాటిపై నిలబడి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపును ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, పట్టణ సచివాలయాల ఇన్‌చార్జి వడ్డే రమణతోపాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బోనాల విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా

వీరబల్లి : మండలంలోని తాటికుంటపల్లె పంచాయతీ ఉప్పరపల్లిలో ముద్దనూరు శేఖర్ రాజు, ముప్పాల శివప్రసాద్ రాజు వారి గృహంలో నిర్వహిస్తున్న బోనాల విందుకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపినాథరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వీఆర్ రెడ్డి, ఎంపీటీసీ సుబ్బరామరాజు, సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, రవికుమార్ రెడ్డి, పాలగిరి మల్లికార్జున రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా..

రాజంపేట రూరల్ : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా చేసుకొని ముందడుగు వేద్దామని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌కు ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎంపికైన కోఆర్డినేటర్లతో ఎన్నికలలో చేపట్టవలసిన ప్రచార కార్యక్రమానికి సంబంధించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిస్తే రాష్ట్రాభివృద్ధి వేగవంతం అవుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు వేయాలని ఆకేపాటి కోరారు. కార్యక్రమంలో నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ధ్యాసంతా చదువుపైనే ఉండాలి'



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : టెన్త్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండున విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదివి మంచి గ్రేడింగ్ పాయింట్లతో ఉత్తీర్ణులు కావాలని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ నల్లబోతుల ఈశ్వరయ్య ఆకాంక్షించారు. స్థానిక మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో హిందీ ప్రతిభా పరీక్షను నిర్వహించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈశ్వరయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. హిందీ ఉపాధ్యాయుడైన సర్తాజ్, విద్యార్థులు హిందీ పాఠ్యాంశంలో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రతిభ పరీక్షను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పరీక్షను బాగా రాసి నగదు ప్రోత్సాహక బహుమతులను గెలుపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఒకవైపు చదువుపై దృష్టిసారిస్తూనే మరోవైపు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమైందని అందువల్ల ఎక్కువగా నీళ్ళు, మజ్జిగ తాగుతుండాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రణాళిక ముఖ్యమన్నారు. విద్యార్థులు ఒక ప్రణాళికను రూపొందించుకొని చదవాలని తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. నీలకంఠేశ్వరరాజు, ఉపాధ్యాయులు కృష్ణకుమారి, రాజశేఖర్, చాంద్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.